క్లుప్తంగా

నాగేశ్వర్‌ను కలిసిన నర్సరీ రైతులు



చందన నాగేశ్వర్‌కు మొక్క అందజేస్తున్న నర్సరీ రైతులు

కడియం: వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్‌ను కడియం నర్సరీ అసోసియేషన్ సభ్యులు గురువారం కలిశారు. నర్సరీలకు పగటిపూట విద్యుత్ ఇవ్వాలని, మైనింగ్ బిల్లును తొలగించాలని విజ్ఞప్తి చేశారు. రైతులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చందన హామీ ఇచ్చారు. అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లా చంటియ్య, ఉపాధ్యక్షుడు కొత్తపల్లి శివాజీ, సభ్యులు బొర్సు సుబ్బారాయుడు, పాటంశెట్టి శేషకుమార్, ఆకుల చంటిబాబు, సింగంశెట్టి శ్రీను పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతాలు తప్పనిసరి

ప్రకాశం నగర్: ఎలక్ట్రికల్ కార్మికులకు ప్రభుత్వ బీమా, పింఛన్ పథకాలు వర్తించాలంటే వారందరికి బ్యాంకు ఖాతాలు ఉండాలని యూనియన్ బ్యాంకు దేవీచౌక్ శాఖ మేనేజర్ వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక విక్రమ్ హాలులో గురువారం గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సర్వసభ్య సమావేశం యూనియన్ అధ్యక్షుడు బొజ్జా రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన యూనియన్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎలక్ట్రికల్ కార్మికులకు తమ బ్యాంకు ద్వారా రూ.500కు ఖాతా తెరుస్తామన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందజేయాలి

రాజమహేంద్రవరం సిటీ: గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల్లో పోష్టికాహార లోపం, అనీమియా, తక్కువ బరువు ఉండే వారి విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఐసీడీఎస్, ఆరోగ్య శాఖ అధికారులతో జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్‌తో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోష్టికాహార లోపం, రక్తహీనతను అధిగమించేందుకు తగిన ప్రణాళికలు అమలు చేయాలన్నారు. జిల్లా స్త్రీ, సంక్షేమ అధికారి కె.విజయకుమారి పాల్గొన్నారు.

సంక్షేమ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ: 2023 -24 ప్రభుత్వ సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న పథకాల వివరాలను ముందుగా తెలియపర్చడం ద్వారా లబ్ధిదారుల్లో చైతన్యం తీసుకురావడం జరుగుతోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనాన్ని అందించాలనే లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, డీపీఓ పి.జగదాంబ, ఎస్ఈ పీఆర్ ఎస్వీవీ ప్రసాద్, సీపీవో కె.ప్రకాశరావు, డీపీఆర్వో ఐ.కాశయ్య పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల కాగడాల ప్రదర్శన

రాజమహేంద్రవరం సిటీ: టీడీపీ నాయకులు ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి వాసును అక్రమంగా అరెస్టు చేశారని ఆ పార్టీ నాయకులు విమర్శించారు. ఈ మేరకు గురువారం కోటగుమ్మం సెంటర్‌లో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణు గోపాలరాయుడు, కార్యదర్శి కాశి నవీన్ కుమార్ పాల్గొన్నారు.

● అవినీతిని ప్రశ్నించిన వారిపైనే అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేస్తున్నారని టీడీపీ మాజీ కార్పొరేటర్లు ఆరోపించారు. గురువారం స్థానిక మెయిన్ రోడ్డులోని హోటల్ జగదీశ్వరిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆదిరెడ్డి కుటుంబంపై కక్ష కట్టి, అక్రమ అరెస్టులకు పూనుకున్నారని ధ్వజమెత్తారు.

రాజమహేంద్రవరం రూరల్: ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరితో ఆయన నివాసంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గురువారం భేటీ అయ్యారు. ముందుగా సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీని కలిశారు. ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి వాసుల అరెస్టును ఖండించారు.

షార్ట్‌ఫిలిమ్ షూటింగ్

సీతానగరం: చినకొండేపూడిలోని వేదాస్ ఆసుపత్రిలో షార్ట్ ఫిలిమ్ షూటింగ్ జరిగింది. మూడు రోజులుగా ఈ ఆసుపత్రిలో హార్ట్ ఎటాక్ సన్నివేశాన్ని చిత్రీకరించారు. ఇప్పటికే మునికూడలి పుష్కర ఘాట్ వద్ద, ములకల్లంక, వెదుళ్లపల్లి పంచాయతీ పరిధిలోని రాజంపేట గ్రామాల్లో షూటింగ్ జరిగింది. నిర్మాతగా సీహెచ్ మధుసూదన్, డైరెక్టర్‌గా సుధీర్ పెరుగు వ్యవహరిస్తున్నారు.

కాటన్ మ్యూజియం.. విజ్ఞాన గ్రంథం

● ఆహ్లాదంతో పాటు ఆనందం
● విద్యార్థులకు రాయితీ



కాటన్ మ్యూజియం

ధవళేశ్వరం: పిల్లలకు వేసవి సెలవులు వచ్చేశాయి. కుటుంబంతో సహ సరదా గడపాలనుకునేవారికి వేదికగా మారింది ధవళేశ్వరం కాటన్ మ్యూజియం . గోదావరి సోయగాల నడుమ నిర్మించిన ఈ మ్యూజియం సందర్శించిన ప్రతి ఒక్కరిని విశేషంగా ఆకట్టుకుంటోంది. కాటన్ మహాశయుని జీవిత విశేషాలతో పాటు గోదావరి పుట్టుక నుంచి సముద్రంలోకి ప్రవేశించే వరకు సమగ్ర వివరాలు ఇక్కడ పొందుపరిచారు. రాష్ట్రం నలుమూలల నుంచి అనేక మంది విద్యార్థులు కాటన్ మ్యూజియాన్ని సందర్శిస్తున్నారు. ఆవరణలో గోదావరి పుట్టిన నాసిక్ నుంచి సముద్రంలో కలిసే వరకు నమూనాను ఏర్పాటు చేశారు. గోదావరిలో ఉప నదులు ఎక్కడ కలుస్తాయి. నది పక్కనే ఉన్న దేవాలయాలతో ఈ నమూనాను ఏర్పాటు చేశారు.

సమగ్ర వివరాలు

మ్యూజియం లోపల డెల్టా నమూనాలతో పాటు కాటన్ జీవిత చరిత్రను సమగ్రంగా అందుబాటులో ఉంచారు. కాటన్ ఆనకట్ట నిర్మాణానికి ముందు ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను కళ్లకు కట్టినట్లు ఉండే విధంగా ఫొటో గ్యాలరీ ఏర్పాటు చేశారు. 1986 వరదలలో ఈ ప్రాంత పరిస్థితిని వివరించే ఫొటోలను సైతం ఏర్పాటు చేశారు. మ్యూజియానికి ఒక పక్క ఆనకట్ట నిర్మాణ సమయంలో ఉపయోగించిన పరికరాలను ఉంచారు. వాటి పేర్లను, వాటిని అప్పట్లో దేనికోసం వినియోగించారో ఆ వివరాలను పొందుపరిచారు. అదే విధంగా కాటన్ బ్యారేజీ పక్కన ఏర్పాటు చేసిన ఈ మ్యూజియంలో ఉన్న పార్కు ఆహ్లాదాన్ని సైతం పంచుతోంది.

విద్యార్థులకు ప్రత్యేక రాయితీ

కాటన్ మ్యూజియం చూసేందుకు టికెట్ ధరను 8 ఏళ్లలోపు పిల్లలకు రూ.5, పెద్దలకు రూ.10గా నిర్ణయించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పూర్తి ఉచితంగా, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు 50 శాతం రాయితీతో సందర్శనకు అనుమతిస్తున్నామని ఇరిగేషన్ శాఖ ఏఈ అద్దంకి సాయిరాం తెలిపారు. అదే విధంగా మ్యూజియం బయట పార్కు అందాలను బంధించేందుకు కెమెరా, వీడియోకు రూ.25 వసూలు చేస్తున్నారు. మ్యూజియం లోపల ఫొటోలు తీసేందుకు అధికారుల అనుమతి తీసుకోవాలి. ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు మ్యూజియం తెరిచి ఉంచుతారు.



గోదావరి నది ప్రవాహ నమూనా



కాటన్ మ్యూజియం ప్రవేశ ద్వారం



ఆనకట్ట నిర్మాణ పనులకు వినియోగించిన ఆవిరి యంత్రం

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కార్యాచరణ



వక్ఫ్‌బోర్డు ఆధీనంలోని స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధ్యక్షుడు ఆరీఫ్ తదితరులు

ప్రకాశం నగర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వక్ఫ్‌బోర్డ్ ఆస్తుల పరిరక్షణ కార్యచరణ వేగవంతం చేసినట్టు జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు మహ్మద్ ఆరీఫ్ తెలిపారు. ఈ మేరకు గురువారం వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షఫీ, సబార్డినెంట్ రసూల్ జానీ, బోర్డ్ డైరెక్టర్లతో కలిసి రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో వక్ఫ్ బోర్డు పర్యవేక్షణలో ఉన్న స్థలాలు, మసీదులను సందర్శించి వాటి వివరాలను సేకరించారు. మసీదుల నిర్వహణ, ఆర్థికపరమైన లావాదేవీలు, ప్రభుత్వం నుంచి అందుతున్న ఇమామ్ మౌజన్‌ల గౌరవ వేతనాలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆరీఫ్ మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు భూములను ఆదాయ వనరులుగా ఏ విధంగా మార్చాలి, అన్యాక్రాంతమైన భూములను తిరిగి స్వాధీనం చేసుకుని పరిరక్షించాలన్న విషయాలపై ఒక సమగ్ర నివేదిక తయారు చేసి న్యాయసలహా తీసుకొని ముందుకు వెళతామన్నారు. జిల్లా డైరెక్టర్లు షబ్బర్ బాషా, షేక్ బిజిలానీ, మహ్మద్ జప్రుల్లా ఖాన్, షేక్ అహ్మద్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం



ఆటోలో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

కంబాలచెరువు: జిల్లాలో గురువారం విజిలెన్స్ అధికారులు చేసిన దాడుల్లో 4,600 కేజీల పీడీఎస్ బియ్యం పట్టుబడింది. కోరుకొండ – రాజమహేంద్రవరం మధ్య ఆకస్మిక తనిఖీ చేసి, ఆటోలో తరలిస్తున్న సుమారు వెయ్యి కేజీల కేజీల పీడీఎస్ బియ్యం గుర్తించారు. ఈ బియ్యాన్ని అన్నపూర్ణమ్మపేటకు చెందిన ఆటో డ్రైవరు ఎస్.సత్యనారాయణ కొలమూరు తరలిస్తున్నాడు. ఈ బియ్యం అదే ప్రాంతానికి చెందిన విశ్వేశ్వరరావుదిగా గుర్తించారు. అతను ఈ బియ్యాన్ని రేషన్‌కార్డులదారుల నుంచి కొనుగోలు చేస్తున్నాడు. వారి నుంచి రూ.2.40 లక్షల విలువైన వెయ్యి కేజీల రేషన్ స్వాధీనం చేసుకుని రాజానగరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

● రాజమహేంద్రవరంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లోని ఓ షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యంపై విజిలెన్స్ అధికారులు గుర్తించారు. 72 బ్యాగుల్లో సుమారు 3,600 కేజీల పీడీఎస్ బియ్యం గుర్తించారు. నగరానికి చెందిన లచ్చిరెడ్డి సురేష్ చంద్‌కు చెందినదిగా గుర్తించారు. అతను నిడదవోలు మండలంలో రేషన్‌కార్డుదారుల నుంచి ఈ బియ్యాన్ని కొనుగోలు చేసి, వాటిని రూ.20కు యానాం పరిసర ప్రాంతాల్లో చేపల చెరువులకు విక్రయిస్తున్నారు. దీంతో అతడిపై కేసు నమోదు చేసారు. తనిఖీల్లో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, తహసీల్దార్ విజయకుమార్, కానిస్టేబుళ్లు వలీ, వీరబాబు పాల్గొన్నారు.

మార్గాని సోదరుల సేవలు అభినందనీయం



కడియపులంకలో కన్వెన్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ భరత్ రామ్

కడియం: నర్సరీ రంగ ప్రముఖులు మార్గాని సత్యనారాయణ, ఆయన సోదరుల సేవలు అభినందనీయమని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. మార్గాని శేషయ్య, సావిత్రమ్మ ట్రస్టు ద్వారా నిర్మించిన కన్వెన్షన్ హాలును ఎంపీ భరత్ రామ్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, డీసీసీబీ అధ్యక్షుడు ఆకుల వీర్రాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, శాసన మండలి మాజీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మచిలీపట్నం మాజీ ఎంపీ కొనగళ్ల నారాయణ, టీడీపీ నాయకుడు గన్ని కృష్ణ గురువారం ప్రారంభించారు. మార్గాని సత్యనారాయణ, ఏడుకొండలు, గోవిందు, వీరబాబు సేవాభావంతో కన్వెన్షన్ హాలును నిర్మించడం అభినందనీయమన్నారు. హరిహర మహాక్షేత్రం నిర్మాణానికి కూడా మార్గాని సోదరులు స్థలాన్ని కేటాయించడాన్ని వారు గుర్తు చేశారు.

చిట్‌ఫండ్ పేరుతో అడ్డగోలు సంపాదన

● ఆదిరెడ్డి మోసాలను బయటపెడతా
● స్టేట్ బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను



విలేకరులతో మాట్లాడుతున్న పాలిక శ్రీను

రాజమహేంద్రవరం సిటీ: డబ్బు, పదవి కోసం ఆదిరెడ్డి అప్పారావు ఏమైనా చేస్తారనడానికి నిదర్శనమే చిట్‌ఫండ్ పేరుతో అడ్డగోలు సంపాదని అని, త్వరలోనే ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి వాసుల బండారం బయటపెడతానని వైఎస్సార్ సీపీ నాయకుడు, స్టేట్ బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను ధ్వజమెత్తారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1982 చిట్ ఫండ్ చట్టాన్ని తుంగలోకి తొక్కి, అమాయక ప్రజల సొమ్మును అడ్డగోలుగా దోచుకుంటున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదిరెడ్డి కుటుంబం చేస్తున్న మోసాలపై అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయన్నారు. చిట్‌ఫండ్ మోసాలను పక్కదారి పట్టించేందుకు బీసీ ముసుగు కప్పే ప్రయత్నం చేస్తున్నారన్నారు. డబ్బు అక్రమంగా కూడబెట్టిన ఆదిరెడ్డి అప్పారావు, వాసును సీఐడీ అరెస్టు చేస్తే, రాజకీయ కక్షతో ప్రభుత్వం అరెస్టు చేసిందంటూ.. సానుభూతి కోసం టీడీపీ నాయకులు ప్రకటనలు ఇవ్వడం దుర్మార్గమన్నారు. నగరాన్ని శరవేగంగా అభివృద్ధి చేస్తున్న ఎంపీ భరత్ రామ్‌కు ప్రజల మద్దతు లభిస్తోందన్నారు. సమావేశంలో మజ్జి అప్పారావు, బెజవాడ రాజ్‌కుమార్, నల్లా రామాంజనేయులు, మార్గాని సురేష్, కడియాల లక్ష్మణరావు, అన్నపూర్ణ రాజు, పెంకే సురేష్, అజ్జవరపు మరిడయ్య, పెద్దిరాజు పాల్గొన్నారు.

7న ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం



విలేకరులతో మాట్లాడుతున్న వైశ్య ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం సారథ్యంలో ఈనెల 7వ తేదీ ఆదివారం హోటల్ మంజీరాలో పూర్వపు ఉమ్మడి గోదావరి జిల్లాల (ప్రస్తుత ఐదు జిల్లాల) ఆర్యవైశ్య ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారు. గోదావరి గట్టు వైఎంవీఏ హాలులో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నగరానికి చెందిన వైశ్య ప్రతినిధులు ఈ విషయం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు, జరుగుతున్న అన్యాయంపై సమగ్రంగా చర్చించి కార్యాచరణ రూపొందించడానికి ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. వైశ్య ప్రముఖుడు కూర్మదాసు ప్రభాకర్, సత్యవరపు గోకుల మురళి, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కంచర్ల బాబ్జీ, వైఎంవీఏ అధ్యక్షుడు గిరి, కార్యదర్శి కళ్యాణ్, మండవిల్లి శివ, మాజీ కార్పొరేటర్ ఇన్నమూరి రాంబాబు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో సాహస బృందం



సాహస బృందం సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: మేప్ మై కంట్రీ పేరుతో పుణెకి చెందిన ముగ్గురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు దేశంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ గురువారం రాజమహేంద్రవరం చేరుకున్నారు. 70 రోజుల పాటు 20 వేల కిలోమీటర్లు పయనించడం ద్వారా వీరు 26 రాష్ట్రాలు, 52 నగరాలు, అన్ని ప్రధాన సరిహద్దులు దాటి 201 గమ్యస్థానాలను చేరాలనే లక్ష్యంతో ఫిబ్రవరి 27న పుణే నుంచి బయలు దేరారు. గురువారం రాజమహేంద్రవరం చేరే నాటికి 21 రాష్ట్రాల్లో 17 వేల కిలోమీటర్ల పర్యటన 61 రోజుల్లో పూర్తి చేశారు. ఫేస్‌బుక్, యూట్యూబ్ లో వీరి పర్యటన వివరాలను తెలుసుకున్న నగరానికి చెందిన కారుణ్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రామకృష్ణ ఈ సాహస యాత్ర బృందానికి ఆతిథ్యం ఇచ్చారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు జైకుమార్ అనాద్కత్, పూజా పాడియా, సోనేష్ మెహ్రా మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వివిధ కళలు, సంస్కృతి, చరిత్ర, ఆహారం గురించి తెలుసుకోవడం తమ లక్ష్యమన్నారు.

మెయిన్ రోడ్డులో ఆక్రమణలు తొలగించాలి



ఎంపీ భరత్ రామ్‌కు సమస్యను వివరిస్తున్న చాంబర్ ప్రతినిధులు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో మెయిన్ రోడ్డులో ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు గురువారం ఎంపీ మార్గాని భరత్ రామ్‌కు విన్నవించారు. మెయిన్ రోడ్డులో జరిగిన అభివృద్ధిపై వ్యాపారులు, నగర వాసులు, కొనుగోలుదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. అయితే చాలామంది చిరు వ్యాపారులు రోడ్డుకు రెండువైపులా స్థలాన్ని ఆక్రమించడం వల్ల చాలా ఇబ్బందిగా ఉందని, వాటివల్ల తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని వాపోయారు. సెంట్రల్ లైటింగ్ వల్ల మెయిన్ రోడ్డుకు నిండుదనం వచ్చిన మాట వాస్తవమేనని, ఆక్రమణల కారణంగా పార్కింగ్ సదుపాయం లేకుండా పోయిందన్నారు. దీనిపై ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ కమిషనర్‌ను పంపించి, ఆక్రమణలు లేకుండా తగు చర్యలు తీసుకోమని సూచిస్తానన్నారు. అలాగే ఈ విషయాన్ని కమిషనర్ ముందుంచగా శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారని ఎంపీ చెప్పారు. పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, చాంబర్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ జవ్వార్, కార్యదర్శి మద్దుల మురళీకృష్ణ, జాయింట్ సెక్రటరీ వెచ్చాబాబ్జీ, బాల సుబ్రహ్మణ్య సింగ్, అర్జున్ ఉన్నారు.

వైభవంగా వెంకటేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠాపన



రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలో కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో జరిగింది. నిర్వాహకులు అనంతాత్ముల బాలాజీ, ఆయన సతీమణి ఉష నిర్వహణలో శ్రీనివాసం ట్రస్టు ఆధ్వర్యంలో గత నెల 30వ తేదీ నుంచి ప్రతిష్ఠోత్సవాలు జరుగుతున్నాయి. గురువారం ఉదయం 7.10 గంటలకు పండితుల మంత్రోచ్ఛారణ నడుమ ఆలయ ప్రతిష్ఠ జరిగింది. స్వామివారి దర్శనం కోసం అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో సందడి నెలకొంది. సాయంత్రం 6.35 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం వారిని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ, వైఎస్సార్ సీపీ నాయకులు ఏవీఎస్ఎన్ మూర్తి, చొంగా వెంకటేశ్వరరావు, కంటే సత్తిబాబు, మేకా నెహ్రూరాజు, ఏడిద పండు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కల్యాణం



గ్రామోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: మండలంలోని పొలమూరు రుక్మిణి సత్యభామ సమేత మదనగోపాల స్వామి వారి ఆలయ జీర్ణోద్ధరణ మహా సంప్రోక్షణ మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం రాత్రి స్వామి అమ్మవార్ల శాంతికర కల్యాణం, గరుడ వాహన సేవ ఆద్యంతం కన్నులపండువగా జరిగాయి. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొని గరుడాళ్వార్‌లకు విశేష పూజాధికాలు నిర్వహించడంతో పాటు శాంతికర కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఉంచి గ్రామ ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం జరిపారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, ఉపసర్పంచి సత్తి సూరారెడ్డి, వ్యాపారవేత్తలు సత్తి బ్రహ్మారెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కట్లమ్మ తల్లి జాతర

బిక్కవోలు: పందలపాక లో కొలువైయున్న కట్లమ్మతల్లి జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. శుక్రవారం కట్టమ్మతల్లి వార్షిక తీర్థం నిర్వహించనున్నారు.

నేడు లలితా సహస్ర నామార్చన

రంగంపేట: చంద్రేడులో కొలువైయున్న దుర్గాదేవికి శుక్రవారం లలితా సహస్ర నామార్చన నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ తెలిపారు. పౌర్ణమి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ఉదయం, సాయంత్రం కుంకుమపూజ నిర్వహిస్తామన్నారు. భక్తులంతా తరలివచ్చి అమ్మవారిని దర్శించు కుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

40 కేజీల గంజాయి పట్టివేత

కంబాలచెరువు: కాతేరు ప్రాంతంలో గంజాయితో ఉన్న నలుగురిని మూడోపట్టణ పోలీసులు గురువారం పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఆ ప్రాంతంలో నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో కొంతమూరుకు చెందిన డి.కార్తిక్, దేవీచౌక్‌కి చెందిన ఎల్.ఉమామహేశ్, కోర్లమ్మపేటకు చెందిన కె.ప్రసాద్, తుమ్మలావకు చెందిన కె.శంకర్‌ను పట్టుకున్నారు. వారి నుంచి 40 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపర్చారు. అనంతరం వారిని రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరంలోని సెంట్రల్ జైలుకి తరలించారు.

సినిమాలు



శ్యామల	రామబాణం
సూర్యమినీ	గార్డియన్స్‌ఆఫ్‌దిగెలాక్సీ
సూర్య	రామబాణం
స్వామి	రామబాణం
శివజ్యోతి	ఏజెంట్
అనుశ్రీ	విరూపాక్ష
రాజా	రామబాణం
అశోక	ఉగ్రం
ఊర్వశి	శాకుంతలం
మేనక	అరంగేట్రం, మంజు(ఇంగ్లిష్)
రంభ	పిఎస్-2
నామవరం	
వీఎస్‌మహల్	రామబాణం
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	రామబాణం
కడియం	
వెంకటసూర్య	రామబాణం